# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ జాతీయ విద్యా విధానం 2020 ఉన్నత విద్యా స్వరూపాన్నే మార్చబోతోందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

- ❖ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఇరుసుమండ గ్రామంలో గల ఓఎన్జీసీ మోరి-5 భావిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.

- ❖ సంస్కృతికి మూలమైన మాతృ భాషను కాపాడుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

- ❖ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకూ 38 లక్షల 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.

- ❖ నూతన పట్టాదారు పాసు పుస్తకాలు రైతుల భూ హక్కుల భద్రతకు భరోసా కల్పిస్తాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

====================

జాతీయ విద్యా విధానం 2020 ఉన్నత విద్యా స్వరూపాన్నే మార్చబోతోందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. విజయవాడలో ఈరోజు జరిగిన రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2040 నాటికి జాతీయ విద్యా విధానం అమలుతో దేశంలో ఉన్నత విద్య ఒక పెద్ద మార్పుకు లోనవుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విశ్వవిద్యాలయాలు నెలకొల్పబడ్డాయని ఇవి ఉన్నత విద్యకు ప్రాప్యతను గణనీయంగా విస్తరింపచేశాయని తెలిపారు. ఉన్నత విద్యలో మహిళల భాగస్వామ్యం పెరగడం సానుకూల అంశమన్నారు. మొదటి తరం అభ్యాసకులతో పాటు గ్రామీణ యువత ఈ విశ్వవిద్యాలయాల ద్వారా విద్యను అభ్యసించగలుగుతున్నారని గవర్నర్ చెప్పారు.

(వాయిస్ 29 సెకన్లు)

====================

కృష్ణా, గోదావరి బేసిన్ పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓఎన్జీసీ మోరి-5 బావిలో బ్లో అవుట్ కారణంగా గ్యాస్ లీకై అగ్ని కీలలు ఎగిసి పడ్డాయి. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో ఆందోళనకర వాతావరణం నెలకొంది. ఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ బ్లో అవుట్ కారణంగా ఇప్పటి వరకూ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఘటనా స్థలి నుండి కిలోమీటర్ మేర నివాసాలను ఖాళీ చేయించామని తెలిపారు. మంటలు అదుపులోకి వచ్చేందుకు మరో 24 గంటల సమయం పట్టే అవకాశం ఉందని ప్రజలెవరు ఆందోళన చెందవద్దని, ఇప్పటికే చుట్టుపక్కల ప్రాంతాలలో అగ్నిమాపక సిబ్బంది నీటిని వెదజల్లుతూ తీవ్రత తగ్గించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రమాదంపై మరిన్ని వివరాలను కలెక్టర్ తెలియజేస్తూ...

(వాయిస్ 43 సెకన్లు)

====================

తెలుగు జాతి ఔన్నత్యాన్ని కాపాడుకోవాలంటే భాషను కాపాడుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. గుంటూరులో ఈ రోజు జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా తపాలా శాఖ కవర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... విలువలు నేర్పేది సంస్కృతి.. అయితే ఆ సంస్కృతికి మూలం భాష అని అందుకే భాషాభివృద్ధికి తాము పూర్తి సహకారం అందిస్తామన్నారు. కవిత్రయం నుంచి అష్టదిగ్గజాల వరకు, గురజాడ నుంచి శ్రీశ్రీ, దాశరథి వరకు ఎందరో మహానుభావులు తెలుగు వైభవం చాటారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనంతరం ప్రపంచ తెలుగు మహా సభలకు హాజరయ్యేందుకు రాష్ట్రానికి వచ్చిన మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ తో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

విరామం

====================

రైతాంగాన్ని అన్ని విధాలా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు గార మండలం రామచంద్రాపురం గ్రామంలో రైస్ మిల్ తనిఖీ చేసి అక్కడ రైతులతో మంత్రి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ 38 లక్షల 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి.. సుమారు ఆరు లక్షల మంది రైతుల ఖాతాల్లో 9,051 కోట్ల రూపాయలు జమ చేశామని చెప్పారు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకొని పకడ్బందీగా ఈ ఏడాది ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చురుగ్గా సాగుతుందన్నారు. రైతులకు మిల్లర్లు ఇబ్బందులు పెడితే నేరుగా ఫిర్యాదు చేయాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి.. రైతుల ఖాతాల్లోకి 1,200 కోట్ల రూపాయలు జమ చేశామని తెలిపారు.

====================

రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ ద్వారా మాధ్యమిక విద్యను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం మూడు కోట్ల 44 వేల రూపాయలతో అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం వసతి గృహాన్ని మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్రలతో కలిసి హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు ప్రారంభించారు. నూతన వసతి గృహంలోని గదులను పరిశీలించిన మంత్రులు వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ... ప్రజా సమస్యలను తీర్చడానికి రెవిన్యూ శాఖ ముందుకు వచ్చిందన్నారు. ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు ఇస్తున్నామని తెలిపారు. పాస్ పుస్తకంపై క్యూ ఆర్ కోడ్ ఉంటుందని, ఈ క్యూఆర్ కోడ్ ద్వారా ఎలాంటి మోసాలు చేయడానికి అవకాశం ఉండదని ఆమె స్పష్టం చేశారు.

====================

పోలవరం ప్రాజక్టు నిర్మాణానికి ముందస్తు నిధుల కింద 5,200 కోట్ల రూపాయలు కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందని బీజేపి జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఈ రోజు నిర్వహించిన బీజేపి జనతా వారధి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. నదుల అనుసంధానం ద్వారా ఏ రాష్ట్రానికి ఇబ్బందులు లేకుండా చేయడానికే కేంద్రం ఎపెక్స్ కమిటీని నియమించిందన్నారు.

====================

గిరిజన ప్రాంతాల్లో విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ గ్రామంలో సుమారు 53 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మండల విద్యా శాఖ కార్యాలయానికి మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలోనే విద్యా వ్యవస్థ బలపడేలా పాఠశాలలకు అవసరమైన సేవలు వేగవంతంగా అందించేందుకు ఈ కార్యాలయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అర్హులైన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అధికారుల సమక్షంలో అందజేశారు. జిల్లాలో మొత్తం 76 వేల 752 పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రైతుల భూ హక్కులు మరింత భద్రంగా ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.

====================

గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మేలు చేసే లక్ష్యంతో ప్రభుత్వం వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం అమలు చేస్తోందని మార్కాపురం జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం, స్వచ్ఛ సంక్రాతిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన గ్రామ సభలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎంజీనరేగాలో తెచ్చిన మార్పులు గ్రామీణులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. గతంలో 100 రోజుల ఉపాధి హామీ పని ఉంటే ఇప్పుడు దానిని 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. గ్రామాలలో ఎవరు పని అడిగినా వెంటనే కల్పించాలని, లేని పక్షంలో వారికి పరిహార వేతనం చెల్లించాలని నూతన చట్టం నిర్ధేశిస్తోందన్నారు.

====================

====================